క్లుప్తంగా

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఆంధ్రప్రదేశ్ దశదిశ మార్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికగా పేరొందిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమైనదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎర్రగోవిందపుట్టుగలో కవిటి-3 గ్రామసచివాలయాన్ని స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలు కడియాల పద్మతో కలిసి శుక్రవారం సందర్శించారు. సచివాలయం వ్యవస్థ పట్ల స్థానికుల స్పందన ఏస్థాయిలో ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కవిటి పంచాయతీ విస్తరణాధికారి జి.వీరభద్రస్వామితో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

కవిటి: ప్రజాస్వామ్య వ్యవస్థలో వజ్రాయుధంగా వ్యవహరించే ఓటుహక్కు విలువను గుర్తించి అందుకు సంబంధించిన జ్ఞానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు అన్నారు. ఈ నెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల బాలికలకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల సిబ్బంది గొండ్యాల విష్ణుమూర్తి, పాపారావు, పి.హరి, కరుణశ్రీ, బొడ్డ శ్రీను బాబు, ఉగాదినాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం పట్టణ ఎస్సైగా ముకుందరావు



బాధ్యతలు స్వీకరించిన ముకుందరావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ ఎస్సైగా ఎం.ముకుందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలపట్ల ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఇ.చిన్నంనాయుడు విశాఖకు బదిలీపై వెళ్లగా.. ముకుందరావు శ్రీకాకుళం నుంచి వచ్చారు.


బంగారం షాపుల్లో సీసీ కెమెరాలు ఉండాలి



బంగారు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్ఐ లవరాజు

సోంపేట: జిల్లాలో ఇటీవల జరుగుతున్న వివిధ సంఘటనల నేపథ్యంలో ప్రతీ బంగారం షాపులో విధిగా సీసీ కెమెరాలను సంబంధిత యజమానులు ఏర్పాటు చేసుకోవాలని సోంపేట ఎస్ఐ లవరాజు అన్నారు. సోంపేట పట్టణ బంగారు వర్తకులతో శుక్రవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పూండి బంగారం షాపు దొంగతనం నేపథ్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయం తక్షణ ఆదేశాల మేరకు వ్యాపారులంతా ఈ విషయంలో ఎటువంటి తాత్సారం చేయకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఎన్నికల కమిషన్ లోగో ఆకారంలో విద్యార్థులు

సోంపేట: స్థానిక సంస్కారభారతి విద్యాసంస్థల ఆవరణలో డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 25న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్ లోగో ఆకృతిలో విద్యార్థులు కూర్చున్నారు. భారత ఎన్నికల సంఘం 75 సంవత్సరాల అంకితమైన సేవను స్మరించుకుంటూ ఈ సంవత్సరం వేడుకల థీమ్ 'ఓటింగ్ లాగ ఏమి లేదు, నేను కచ్చితంగా ఓటు వేస్తాను'అని అవగాహన కల్పించారు.

గ్రామ సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండాలి

కాశీబుగ్గ: మందస మండలం పరిధిలోని 57 గ్రామ సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండేటట్లు సిబ్బంది కలసికట్టుగా పనిచేయాలని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండల మహిళా సమాఖ్యలో శుక్రవారం ఏర్పాటు చేసిన సిబ్బంది శిక్షణ, సమీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థికాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సంఘంలో అందరికీఅర్థమైనట్లు వివరించాలని సూచించారు. లీగల్ కో-ఆర్డినేటర్ వీరం నాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్లు కిషోర్ ఉన్నారు.

కరిగిపోతున్న కంకర కొండలు!

- అన్యాక్రాంతమౌతున్న వైనం
- రాత్రి, పగలు తేడాలేకుండా అక్రమ క్వారీయింగ్
- జగనన్న కాలనీ లేఅవుట్ల వద్ద తవ్వకాలు
- పట్టించుకోని అధికారగణం



దెబ్బతింటున్న తలతంపర జగనన్న కాలనీ లే అవుట్



జగనన్న కాలనీ దిగువ భాగంలో తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులు

తవ్వకాలు అరికడతాం



అక్రమ కంకర తవ్వకాల విషయాన్ని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. మైన్స్‌శాఖ సహాయంతో అరికడతామన్నారు. కొద్దికాలంగా మండలంలో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్‌పై ఆయన స్పందించారు. మండపల్లి, తలతంపర జగనన్న కాలనీ లేఅవుట్ల వద్ద అనుమతులు లేకుండా కంకర తవ్వకాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక వీఆర్వో, తలయారీలను తవ్వకాలు చేపట్టే చోటుకు పంపామన్నారు. అప్పటికే అక్కడ నుంచి తవ్వకాలు చేపట్టిన వారు వెళ్లిపోయారని, ఇక నుంచి అక్కడ ఎటువంటి తవ్వకాలు చేపట్టకుండా తలయారీని కాపలా పెడతామన్నారు. – ఎస్.రమేష్‌కుమార్, తహసీల్దార్

కంచిలి: కంకర కొండలు కరిగిపోతున్నాయి. అనాధికారికంగా కొంతమంది తవ్వకాలు చేపట్టి సొమ్ము చేస్తుకుంటున్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కంచిలి మండల పరిధిలో కంకర కొండలు కొన్నిచోట్ల పూర్తిగా అన్యాక్రాంతమౌతున్నాయి. కొన్నాళ్లుగా వీటిని అడ్డగోలుగా తవ్వుకొని రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఎటువంటి అధికారిక అనుమతులూ లేకుండా తమ ఇష్టానుసారంగా యంత్రాల సహాయంతో తవ్వకాలు చేసేన్నారు. అక్రమార్కులకు ఇది పెద్ద ఆదాయ వనరుగా మారింది. ముఖ్యంగా మండలంలో సోంపేట పట్టణానికి సమీపంలో ఉన్న మండపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అక్రమార్కులు ముఖ్యంగా జగనన్న కాలనీలకు ఆనించి ఉన్నటువంటి కొండల్నే ఎంపిక చేసుకొని తవ్వేస్తున్నారు. దీని వలన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్లకు కేటాయించిన సరిహద్దులు రాత్రికి రాత్రి మాయమౌతున్నాయి. కాలనీ లే అవుట్లలో కొండ అంచున ఉన్న ప్లాట్లు రోజుకొకటి మాయమౌతున్నాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తలతంపర, మండపల్లి గ్రామాలకు చెందిన జగనన్న కాలనీ లే అవుట్ల వద్ద కంకర క్వారీల్లో తవ్వకాలు చేపడుతుండటంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పోరంబోకు స్థలాల్లో కూడా..

మరోవైపు ప్రభుత్వ పోరంపోగు స్థలాల్లో ఉన్నటువంటి కొండల్లో రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు చేపట్టి రియల్ ఎస్టేట్ వెంచర్లకు రోడ్లు, స్థలం చదును చేయడానికి కంకర నిల్వలను కొంతమంది తరలిస్తున్నారు. వీరికి కొందరు టీడీపీ నేతలు అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులు వీరిని సంప్రదించి, తర్వాతనే తవ్వకాలు చేపడుతున్నట్లు చెబుతున్నారు. మండపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఎప్పటికప్పుడు అడ్డగోలుగా కంకర తవ్వకాలు చేపడుతున్నారని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. దీని వలన పర్యావరణ పరిరక్షణ పూర్తిగా దెబ్బతింటోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ తవ్వకాలు అధికార యంత్రాంగం ఆపకపోతే భవిష్యత్తులో కొన్ని చోట్ల కంకర కొండలే కనుమరగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉచిత వైద్యం శిబిరం



మనిషికి ఆరోగ్యమే ఐశ్వర్యమని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్ అన్నారు. చారిటబుల్ ట్రస్టు కల్వరి బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం ఈదుపురం ఆంధ్ర బాప్టిస్టు చర్చి ఆవరణంలో 95వ ఉచిత మేగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 153 మంది రోగులకు శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రవికిరణ్, డాక్టర్ బి.ప్రణీత్‌రాజ్‌లు పరిశీలించి ఉచితంగా మందులు అందజేశారు. పాస్టర్లు బిమ్మో బెహరా, దద్ద ఏలియా, హంగీర్ బెహరా, గంగాధర్ రెడ్డి, బోర ప్రసాద్, రామచంద్ర బెహరా, అంబటి ఈశ్వరరావు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

రోడ్డు పనులు ప్రారంభం



వజ్రపుకొత్తూరు మండలంలోని అమలపాడు- ఉద్దానం గోపీనాథపురం రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రూ. 1.70 కోట్లతో 2.3కిలో మీటర్ల మేర తారురోడ్డును నిర్మించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ, బత్తిన మోహనరావు, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, దున్న షణ్ముఖరావు, మదనాల జోగారావు, గోవింద పాపారావు, వంక రామారావు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

చెస్ పోటీలు



పలాస మండలం రంగోయి, బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు చెస్ టోర్నమెంటు పోటీలు నిర్వహించారు. ఉద్దానం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. చెస్‌తో పిల్లల్లో ఆలోచనాశక్తి పెరుగుతోందని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వీర్రాజు అన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో ఉద్దానం ఫౌండేషన్ ప్రతినిధులు తామాడ శ్రీకాంత్, తామాడ మనోజ్, రత్నాలప్రదీప్, తామాడ క్రాంతి, తామాడ విక్రాంత్, రంగోయి హెచ్.ఎం టి.హేమారావు, పీటీ డి.లక్ష్మణ్‌కుమార్, బొడ్డపాడు పీడీ సి.హెచ్.రామ్‌జీ పాల్గొన్నారు. – పలాస

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



ప్రహరీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే అందరి లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బొరివంక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో రక్షణ గోడను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని కూడా బొరివంక ప్రాథమిక పాఠశాలకు అధికారులు కేటాయిస్తున్న నేపథ్యంలో ఇక్కడ రక్షణ గోడ అత్యంత అవసరమని స్థానిక ప్రజాప్రతినిధులు తమను కోరడంతో నిధులు మంజూరు చేశామన్నారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.70 లక్షలు వెచ్చించి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సతీష్, వై.నీలయ్య, స్కూల్‌కాంప్లెక్స్ చైర్మన్ సనపల రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 10 వినతులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార గ్రీవెన్స్‌కు పది వినతులు వచ్చాయి. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు కాశీబుగ్గ డీఎస్పీ ఎం.అప్పారావు వినతులు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

రెండో షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్‌కు అనుమతి

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్‌లో రెండో షిఫ్ట్ రిజర్వేషన్ కౌంటర్ నిర్వహణకు అనుమతి లభించినట్లు జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస రాళో తెలిపారు. ఈ మేరకు ఖుర్దా డీఆర్ఎం నుంచి ఉత్తర్వులు విడుదలైనట్లు శుక్రవారం చెప్పారు. కొన్నాళ్ల క్రితం ఇక్కడ రెండో పూట రిజర్వేషన్ సౌకర్యాన్ని రద్దు చేయడంతో, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుని ఆధ్వర్యంలో స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులంతా రైల్వే అధికారులను కలిసి పునరుద్ధరించమని కోరారు. దీంతో ఎట్టకేలకు మళ్లీ రెండో పూట రిజర్వేషన్ సౌకర్యాన్ని మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సేవలు శనివారం నుంచి ప్రారంభమౌతాయని స్టేషన్ మేనేజర్ బెహరా వెల్లడించారు. కార్యక్రమంలో రిటైర్డు టీటీఈ ఎల్.సూర్యనారాయణ, స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు తిరుపతి, రవి, స్థానికులు మల్లేశ్వరరావు, చిట్టి పాల్గొన్నారు.

తీరంలో గస్తీ ముమ్మరం



సోంపేట: బారువ తీరంలో డ్రోన్ తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీసు అధికారుల బృందం

సోంపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘ విద్రోహశక్తుల నుంచి రక్షించే చర్యల్లో భాగంగా తీరప్రాంతంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్టు బారువ మెరైన్ సీఐ డి.వి.జె.రమేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బారువ, ఎర్రముక్కాం తదితర సముద్ర తీరంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం డ్రోన్‌తో నిఘావ్యవస్థ తీరును పర్యవేక్షించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎర్రముక్కాం, మందస మండలం బేతాళపురం, చిన్నలక్ష్మీపురం గ్రామ తీరం దరిలోగల రాళ్లను డ్రోన్ కెమెరాలతో సర్వే చేశామన్నారు. బారువ రాష్ట్రంలో 32 ద్వీప ప్రదేశాలు/రాళ్ల సముదాయాలు ఉన్నాయని, పై అధికారుల ఆదేశాల మేరకు ఈరోజు బారువ తీరం పరిధిలో గుర్తించిన వాటిని తనిఖీ చేశామని తెలిపారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. అధికారుల సమక్షంలో వినతులు స్వీకరించి తక్షణ పరిష్కార మార్గాన్ని చూపారు. కోటబొమ్మాళి మండలానికి చెందిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను అందజేశారు.

నియోజకవర్గస్థాయి గిగ్స్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి గిగ్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖాధికారులు డి.తులసీరావు రెడ్డి, డి.చిన్నారావులు క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం ఎం.అనూరాధ అధ్యక్షతన జరిగిన క్రీడల్లో నియోజకవర్గం పరిధిలోని నలుగు మండలాల నుంచి సుమారు 60 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాలకు చెందిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జి.సునీత, సీతాపురం ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వేణికుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు బి.నారాయణరావు, లక్ష్మణరాజా, కేకే రామిరెడ్డి, జగ్గమ్మ, కె.రఘునాథరావు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి



నందిగాం: వలంటీర్లకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

నందిగాం: గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులను స్వచ్ఛంద వలంటీర్లు అక్షరాస్యులుగా మార్చాలని ఎంపీడీవో రాజారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస కార్యక్రమంలో భాగంగా రెండో విడత స్వచ్ఛంద వలంటీర్లకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఉల్లాస కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని నిరక్షరాస్యులకు తెలియజేసి వారిలో అక్షర జ్ఞానం కల్పించాలన్నారు. ఆ దిశగా వలంటర్లు కృషి చేసి మండలంలో నిరక్షరాస్యత శాతం తగ్గించాలన్నారు. డ్వాక్రా మహిళల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాలు నేర్పాలని అన్నారు. అనంతరం శిక్షణ ఇచ్చిన 124 మందికి పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఏపీఎం మనోరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి, అరుణ, సరోజిని, సీసీఎస్‌లు గణేష్,పద్మ, హేమ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండో విడత ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వలంటీర్లకు అభ్యసన పుస్తకాలను అందించారు. వెలుగు ఏపీఎం జి.ప్రసాదరావు, సీసీలు పాల్గొన్నారు.

కంచిలి: శతశాతం అక్షరాస్యత సాధించేదిశగా కృషిచేయాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలోఉల్లాస్ కార్యక్రమం నిర్వహణకు మండలంలో నూతనంగా నియమించిన వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. 113 వలంటీర్లకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఈఓ ఎస్.ప్రసాదరావు, ఏపీఎం ప్రసాదరావు ఉన్నారు.

మహేంద్రతనయ నదిపై జర్నల్ ఆవిష్కరణ



జర్నల్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

కాశీబుగ్గ: మహేంద్ర తనయ నదిలోని జీవావరణ పరిస్థితులు, అందులో లభ్యమయ్యే వివిధ రకాల చేపల జాతులపై బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర ఆధ్యాపకుడు కె.హేమసుందర్‌రావు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన పలాస డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు హరికృష్ణ ప్రసాద్ తన పీహెచ్‌డీ అధ్యయనంలో తయారీ చేసిన జర్నల్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా జర్నల్‌ను పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. ఒడిశా-ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో నది పుట్టుక, ప్రాంతాలవారీగా దానిలోని జీవసంపద, వాతావరణ పరిస్థితులు అధ్యయనం చేసి పొందుపరిచారు. స్థానిక మత్స్యకారులు, రైతులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ పరిశోధన విషయాలను ఈ నెల 20వ తేదీన కోల్‌కతాకు చెందిన ఉత్తరప్రదేశ్ జర్నల్ ఆఫ్ జువాలజీలో ముద్రణా సంస్థ వారు ప్రచురిస్తారని ప్రతినిధులు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బూర్జపాడు పంచాయతీ డొంకూరులో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. డొంకూరు మత్స్యకార తీర ప్రాంతానికి సంబంధించి రెండు వంతెనలు, కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తామని అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంచనాలు ఆదాయం పెరిగేలా ఉండాలి

- మున్సిపల్ సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం 2025-26 ఆర్థిక సంవత్సరానికి పురపాలకసంఘం అధికారులు తయారు చేసిన వార్షిక బడ్జెట్ అంచనాలు ఆదాయం పెరిగేలా ఉండాలని.. అందుకు తగ్గట్టుగా బడ్జెట్‌ని మార్పు చేయాలని వైస్‌చైర్‌పర్సన్-2 లాబాల స్వర్ణమణి, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బి.జగన్ తదితర సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన వార్షిక బడ్జెట్ అంచనాపై సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. గత ఏడాది సవరించిన బడ్జెట్ ముగింపు నిల్వను 2025-26 వార్షిక బడ్జెట్ అంచనా ప్రారంభ నిల్వ రూ. 17,02,73,462గా నిర్ణయించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా విలువ రూ.19,22,95,593 కాగా 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచన కింద 187,69,71,462 రూపాయలను చూపించారు. దీంతో పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, అంచనాలు ఈ వార్షిక సంవత్సరానికి ఎందుకు తగ్గాయని సభ్యులు ప్రశ్నించారు. మున్సిపాలిటీలో గతంకంటే నిర్మాణాలు రోజురోజుకీ పెరుగుతున్నప్పటికీ మున్సిపాలిటికీ వచ్చే ఆదాయం పెరగకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన అంచనాలపై మరోసారి పునఃపరిశీలన చేయాలని వైస్‌చైర్‌పర్సన్లు, కౌన్సిల్ సభ్యులు సూచించారు. పురపాలకసంఘంలో ప్రకటనలకు సంబంధించిన బోర్డులు దర్శనమిస్తున్నాయని.. వాటినుంచి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సలహాలు సూచనల మేరకు స్వల్ప మార్పులతో వార్షిక బడ్జెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి ఆమోదించారు. సమావేశంలో ఐదు అంశాలపై చర్చించారు. ఎవరూ ఉపయోగించని చలివేంద్రాల ఏర్పాటుకు లక్షలాది రూపాయలు వెచ్చించడం కంటే అన్నివార్డుల్లో మరమతులకు గురైన బోర్లను బాగుచేయించాలని ఒకటోవార్డు కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. దీంతో చలివేంద్రం ఏర్పాటు అంశాన్ని రద్దు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. పట్టణానికి మంచినీటి సమస్యలేకుండా బాహుదానదిలో ఊటబావుల వద్ద శాశ్వత గట్టు నిర్మాణానికై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కౌన్సిలర్లు నిర్ణయించారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్-1 ఉలాల భారతిదివ్య పాల్గొన్నారు.

ఆడపిల్లను ఎదగనిద్దాం



కాశీబుగ్గ: పలాస రైల్ నిలయంలో అవగాహన కల్పిస్తున్న చైల్డ్ హెల్ప్‌డెస్క్ సిబ్బంది

ఆడపిల్లలను పుట్టనిద్దాం, వారిని బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దామని వక్తలు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని..వారిని మరింత ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా చైతన్య ర్యాలీలు నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: బాలిక ఆకృతలో కొళిగాం ఉన్నత పాఠశాల విద్యార్థినులు



కవిటి: బాలికల హక్కుల్ని వివరిస్తున్న ఐసీడీఎస్ ఇచ్ఛాపురం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీవో పి నాగరాణి



కవిటి: కొత్తపాలెం కేజీబీవీలో బాలికల మానవహారం



టెక్కలి: ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న డిగ్రీ కళాశాల మహిళా సాధికారత అధ్యాపకులు లీలాపద్మజ



కంచిలి: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం



కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



ఇచ్ఛాపురం: రత్తకన్న సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తూ..